పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులకు ఇంటి నంబర్లు కేటాయించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి జీఎం సుదర్శన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ నిషేధిత భూమిలో ఆరుగురు ప్రైవేటు వ్యక్తులకు పంచాయతీ కార్యదర్శి ఇంటి నంబర్లు కేటాయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. దీంతో సంబంధిత ఈఓ తన సొంత రక్త సంబంధీకులతో పాటు ఓ వార్డు సభ్యుడి బంధువులకు ప్రభుత్వ భూమిలో ఇంటి నంబర్లు కేటాయించనట్లు గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ మురళి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. మండల పంచాయతీ అధికారి సమర్పించిన నివేదిక ద్వారా పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ ఇంటినంబర్లు కేటాయించినట్లు రుజువైందన్నారు. దీంతో ఈఓను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఆలోచించి ఓటెయ్యండి

సదాశివపేట(సంగారెడ్డి): రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని ప్రజాశక్తి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొడ్ల వెంకట్ అన్నారు. సదాశివపేట పట్టణంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ల హయాంలో పదేళ్ల అభివృద్ధి వెనక్కిపోయిందని, ప్రజలు వారిద్దరికి ఓటు వేస్తే మరో 20ఏళ్ల అభివృద్ధి వెనక్కిపోవడం ఖాయమన్నారు. దీంతో ప్రజలు ఆలోచించి విద్యావంతుడైన తనను నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాశక్తి పార్టీ జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఖేడ్‌కు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు ముంతాజ్‌తో పాటు పలువురు ముస్లింలు, బీఆర్ఎస్‌కు చెందిన కొండ్యానాయక్‌తండా పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్, బీబీపేట కింది తండా, కరస్‌గుత్తి, మావినెల్లి తండా, డీఎస్‌టీ తండాకు చెందిన పలువురు నాయకులు ఉన్నారు. అదేవిధంగా పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపూర్‌కు చెందిన నాయీబ్రాహ్మణులు సత్యనారాయణ, సాయిలు, అంబయ్య, బాలయ్య, సంగమేష్, బాగయ్య, రవి ఉన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు నరేందర్, హన్మండ్లు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను నమ్మొద్దు

- ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించండి
- పటాన్‌చెరు ప్రగతిని వివరించండి
- సమష్టిగా పనిచేస్తే బీఆర్ఎస్‌దే విజయం
- బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నమ్మొద్దని, పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 405 బూతుల లో 3,97,237 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు, కార్యకర్తలు తప్పనిసరిగా బీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమన్వయంతో పనిచేస్తే లక్ష మెజారిటీతో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, సపానదేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం.. అమీన్‌పూర్..

నాలుగు సంవత్సరాల్లో అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీ, లాలబావి కాలనీ, భరత్‌నగర్ కాలనీ, సాయిఅంబికా కాలనీ, బృందావన్ టీచర్స్ కాలనీ, ఇండస్ వ్యాలీ హోమ్స్ తదితర కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డితో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆయా వార్డుల సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కారు గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి

పటాన్‌చెరు టౌన్: అభివృద్ధిని చూసి మరో మారు ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని చాకలిబస్తీలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోతో పాటు మహిపాల్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల మేనిఫెస్టోలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీను, రాజన్ సింగ్, ముత్యాలు, బబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బొల్లారం యువకులు

పటాన్‌చెరు: పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన సురేష్, మారుతి, హసన్ పాషా, అభినాష్ తదితరులు బొల్లారం సీనియర్ నాయకులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ విజయానికి సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, కౌన్సిలర్లు వరప్రసాద్‌రెడ్డి, గోపాలమ్మ వెంకటయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


చాకలిబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బీఆర్ఎస్‌లో భారీగా చేరిక

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్తూరు గ్రామ పరిధిలోని కొర్లకుంటకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ జనార్దన్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచార సీడీని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

ఆదర్శంగా తీర్చిదిద్దాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పోరాడి సాధించుకున్న తెలంగాణను అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిపామని ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలో శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే నయవంచనకు, మోసానికి చిరునామా అని విమర్శించారు. దశాబ్ద కాలం పాటు ప్రజలను పట్టించుకోని ప్రతిపక్షాలు నేడు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నాయని ఘాటుగా ప్రశ్నించారు. అనంతరం డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిలో పాల్గొని నివాళులర్పించారు. కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు గోవింద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు


అమీన్‌పూర్‌లో వివిధ పార్టీ నాయకులకు బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి


బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో కొర్లకుంట యువకులు

క్లుప్తంగా

బీఎస్పీలో చేరిక

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో జానకంపేటకి చెందిన వార్డ్ మెంబర్ సుధాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కిషోర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ సమక్షంలో సోమవారం బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల అస్తిత్వానికై ఆత్మగౌరవానికి పోరాటం చేస్తున్న తనకు మద్దతుగా కదలివస్తున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు అని తెలిపారు. నవంబర్ 30న నిర్వహించనున్న ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పేకాట స్థావరాలపై దాడి

నారాయణఖేడ్: మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఆదివారం రాత్రి పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 50మందిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.96వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. సంజీవన్‌రావుపేట్‌లో 23మంది, పిప్రిలో 17మంది, హన్మంత్‌రావుపేట్, పోతన్‌పల్లి(ఆర్) గ్రామాల్లో ఐదుగురు చొప్పున పేకాట ఆడుతూ పట్టుబడ్డారని వివరించారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కడైనా పేకాట ఆడితే తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కంగ్టి మండల కేంద్రంలో..

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలో ఆదివారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విశ్వజన్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో జూదరుల వద్ద నుంచి రూ.10, 200లు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదమాడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రేషన్ కోటాకు వినతి

నారాయణఖేడ్: మండల పరిధిలోని పంచగామకు సరిపడా రేషన్ బియ్యం కోటాను కేటాయించి పంపాలని కోరుతూ నారాయణఖేడ్ డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్‌కు పలువురు లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ఏడాదికాలంగా లబ్ధిదారుల మేరకు కోటాకు సంబంధించిన బియ్యం కేటాయించకపోవడంతో నెలనెలా ఇతర గ్రామాలకు వెళ్లి తీసుకువస్తున్నామని, కోటా కేటాయించని పక్షంలో ఎన్నికల్లో ఓట్లు వేయబోమని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జహీరాబాద్: ఎన్నికల పరిశీలకులు పవన్ కుమార్ జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూంను సోమవారం పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. అనంతరం బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టుల గురించి, కేంద్రాల్లోని వసతులపై చర్చించారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి ఉన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన నీలం హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని మాజీ ఎంపీపీ హన్మంత్‌రావు పాటిల్ హాజరై ప్రారంభించారు. శిబిరానికి వివిధ గ్రామాలకు చెందిన 400 మందికి పైగా ప్రజలు హాజరైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పెంటయ్య, నాయకులు సంగన్న ముదిరాజ్, హమీద్, ఇస్మాయిల్, దత్తు, ఇస్రాహుల్, వైద్యులు డాక్టర్ నవాజ్, డాక్టర్ గౌతమి, డాక్టర్ గోకుల్, డాక్టర్ అయాజ్ అలీ పాల్గొన్నారు.


ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, నాయకులు

కాంగ్రెస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం

సదాశివపేట(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 8, 22 వార్డుల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పట్నం సుభాష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పట్నం విజయలక్ష్మి, కౌన్సిలర్ నాగరాజ్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ, నాయకులు రాములుగౌడ్, తుకరాం, వీరన్న, చోటుబాయ్, లైక్, ఆంజనేయులు, వంశీగౌడ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఓడిపోతామని భయంతోనే ఆరోపణలు

జోగిపేట(అందోల్): ప్రజాక్షేత్రంలో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పుల్కల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు వీరభద్రరావు అన్నారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ నామినేషన్ అఫిడవిట్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, అన్ని వివరాలు సరిగానే ఉండటంతో నామినేషన్ పరిశీలనలో తమ నామినేషన్ ఆమోదించారని తెలిపారు. ఆందోల్‌లో రెండోసారి బీఆర్ఎస్ గెలుస్తుందని, దీనిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి వెంట రామగౌడ్, జగన్‌రెడ్డి, అశోక్, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్‌ది ఆదర్శవంత పాలన

- సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం
- ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

జహీరాబాద్: సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో బీఆర్ఎస్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని రాయిపల్లి(డి), హుగ్గెల్లి గ్రామాల్లో సోమవారం డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన పాలనను అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. అందుకే.. అనేక రాష్ట్రాలు ఇక్కడి సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఆత్మచైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుడప్ప, మాణిక్యమ్మ, ఏసురత్నం, తాజొద్దీన్, గోవర్ధన్‌రెడ్డి, రాచన్న, బండి మోహన్, మాణయ్య, మధు, ఖాశీం, తుకారం, దత్తురెడ్డి, వహీద్, హీరూ రాథోడ్, రాములు, శేఖర్, విఠల్‌రెడ్డి, జైరాజ్, స్వామిదాస్, అమర్‌నాథ్‌రెడ్డి, బక్కన్న, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.


రాయిపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు


హుగ్గెల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఆందయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశంకు చెందిన శివకుమార్(31)మోటర్ మెకానిక్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10న తన బైక్‌పై ఇంద్రదేశం నుంచి పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌కు వెళ్తుండగా సర్వీస్ రోడ్డు సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలైయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య పరమేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- బీఆర్ఎస్ పాలనలో అవినీతి పెరిగిపోయింది
- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటా
- కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు. మొగుడంపల్లి మండల పరిధిలోని గౌసాబాద్, సజ్జారావుపేట తండాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలకులు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. అంతేకాకుండా అవినీతి పెరిగిపోయిందని, దానికి ఉదాహరణ మేడిగడ్డ ప్రాజెక్టేనని తెలిపారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కమీషన్ల పేరుతో అందినకాడికి దోచుకున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్, బీజేపీలు భయపడుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా కుంటుపడాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తామని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని వివరించారు. నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆశీర్వదించి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. నాయకులు మక్సూద్, ఎంజీ.రాములు, హర్షద్, ఖాజామియా పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్ అన్నారు. మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంజూర్, జాకీర్, కిష్టన్న తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం హన్మంత్‌రావు పాటిల్ మాట్లాడుతూ ఈ నెల 30న నిర్వహించనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు వీర్‌శెట్టి పాటిల్, గుండప్ప, నాగేష్ పటేల్, బాబుసాబ్, సాబేర్‌పటేల్, శంకర్, పెంటయ్య, రవి పాల్గొన్నారు.


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


గిరిజన మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అనుభవ మండపంలో ప్రార్థనలు

వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అనుభవ మండపంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వాహకులు చంద్రశేఖర్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్

బైండోవర్ చేయడం సరికాదు

సంగారెడ్డి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న తమను బైండోవర్ చేయడం సరికాదని సీపీఎం నేతలు అతిమేల మాణిక్, యాదగిరి అన్నారు. ఈ మేరకు సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వారు బైండోవర్‌కు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండాలు, రౌడీలను చట్టవ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వాళ్లను బైండోవర్ చేసినట్లు ప్రజాసమస్యలపై స్పందిస్తూ ప్రజాస్వామిక పద్ధతిలో ఆందోళన ఉద్యమాలు చేసే తమను బైండోవర్ చేయడం విచారకరమన్నారు. వెంటనే బైండోవర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

జహీరాబాద్ టౌన్: జాతీయ రహదారిపై బూచినెల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలంలోని సత్వార్‌కు చెందిన ఆమీర్(28) పట్టణం నుంచి సత్వార్ వైపు మోటారు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వెనక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

పటాన్‌చెరు: మండల పరిధిలోని నందిగామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లె శ్రీశైలం యాదవ్, ముత్తంగి ఉపసర్పంచ్ లింగారెడ్డి తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు సపనాదేవ్, శంకర్‌యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, అంజయ్యయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు పాండు, సర్పంచులు ఉపేందర్, లక్ష్మణ్, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

ఓటు వినియోగించుకోండి

జోగిపేట(అందోల్): ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని అందోల్ జనరల్ అబ్జర్వర్ దీపక్ సింగ్లా అన్నారు. అందోల్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జోగిపేట పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి పాండుతో కలిసి సందర్శించారు. తహసీల్దార్ ఆంటోనీ, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400